ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 285
పేజీలు : 5 వెల రూ. 2/-
బుధవారం
11 ఫిబ్రవరి 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com


## సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్

ప్రధాని మోదీ వ్యాఖ్య..



2 లో

## నాటి పరికరాలతో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

- భారాసపై మంత్రి పొంగులేటి ఆరోపణ
- వాటిని ఎక్కడ దాచారో విచారించి.. చర్యలు తీసుకుంటామని వెల్లడి



2 లో

ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో

# నేడు పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్ - రీపోలింగ్ అవసరమైతే రేపు నిర్వహణ
- మక్తల్ ఆరో వార్డు ఎన్నిక వాయిదా - 13న లెక్కింపు.. 16న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక



2 లో

## మున్సిపల్ ఎన్నికల కోసం సీఎం సొంత జిల్లాలో దౌర్జన్యాలు

లోక్‌సభలో ధ్వజమెత్తిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



2 లో

## తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష

- రాజకీయ దురుద్దేశంతో నిధుల్లో కోత
- రాష్ట్రం ఇచ్చేది రూ.1.33 లక్షల కోట్లు.. తిరిగొచ్చేది రూ.51 వేల కోట్లే
- మంత్రి తుమ్మల ధ్వజం



2 లో

దిక్కుమాలిన సర్కార్..

# ఉన్న హక్కులనూ కాపాడలేని అసమర్థ ప్రభుత్వమిది

- కృష్ణా జలాల దోపిడీని చేష్టలుడిగి చూస్తున్న రేవంత్ ప్రభుత్వం
- గతనెల 28 నాటికే 664 టీఎంసీల నీటిని వాడుకున్న ఏపీ
- ఏపీ నిర్వాకంతో అటు సాగర్, ఇటు శ్రీశైలం ఖాళీ అవుతున్నయ్
- కోటాకు మించి 80% నీళ్లను దోచుకుపోతున్నా సోయిలేదా?
- రాష్ట్ర ప్రభుత్వ నిస్సహాయతతోనే కేఆర్ఎంబి సైతం ఏపీకే వత్తాసు
- బిజెపి, కాంగ్రెస్ నేతలు కలిసి తెలంగాణ బొండిగె పిసుకుతరా?
- ఉన్న నీళ్లన్నీ దోచుకుపోతున్నా ఉత్తరాలు రాస్తూనే ఉంటరా?
- కేసీఆర్‌పై ఏడుపు తప్ప తెలంగాణ హక్కులు, రైతుల గోస పట్టవా?
- అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను ముఖ్యమంత్రి ఎందుకు అడుగరు?
- అక్కడ తన గురువు ఉన్నాడనే రేవంత్‌రెడ్డి భయపడుతున్నడా?
- తెలంగాణ జలహక్కులకు గండి కొడ్తుంటే బిఆర్ఎస్ ఊరుకోదు
- ఢిల్లీలోని కేఆర్ఎంబి ఆఫీస్‌ను ముట్టడిస్తం.. హరీశ్‌రావు హెచ్చరిక




2 లో

## ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో

# నేడు పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
రాష్ట్రంలో 'పుర'పోరుకు రంగం సిద్ధమైంది. ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రీపోలింగ్ అవసరమైతే 12న నిర్వహిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల లోపల, బయట వెబ్‌కాస్టింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొంది. ఓట్ల లెక్కింపు 13న జరుగుతుంది. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి.
మొత్తం ఏడు నగరపాలక సంస్థల్లోని 414 డివిజన్లకు, 116 పురపాలికల్లోని 2,582 వార్డులను ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో రెండు డివిజన్లు, 12 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మక్తల్‌లోని ఆరో వార్డు భాజపా అభ్యర్థి మృతి వల్ల అక్కడ ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 412 డివిజన్లు, 2,569 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 12,944 మంది బరిలో ఉన్నారు. 16,382 బ్యాలెట్ బాక్స్‌లను ఉపయోగించనున్నారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు.
కార్పొరేషన్ల వారీగా చూస్తే 412 డివిజన్లలో 2,225 మంది పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ 410, భారాస 401, భాజపా నుంచి 382 మంది ఉన్నారు. 2,174 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా కరీంనగర్‌లో 66 డివిజన్లకు 398 మంది పోటీ పడుతున్నారు.
పురపాలికల వారీగా చూస్తే మొత్తం 2,569 వార్డులలో 10,719 మంది పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి 2,538, భారాస 2,478, భాజపా నుంచి 2,252 మంది బరిలో ఉన్నారు. 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 49 వార్డులకు 314 మంది పోటీ చేస్తున్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ..
ఎన్నికల కోసం డివిజన్లు, వార్డుల వారీగా ఫొటో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయింది. ఎన్నికల సంఘం రూపొందించిన టీపోల్ యాప్‌లోకి వెళ్లి ఓటర్ గుర్తింపు కార్డు(ఎపిక్) నంబరు సాయంతో స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఓటర్ల సహాయం కోసం 92400 21456 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని కోరారు. స్థానిక పాలనను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు ఇంటింటికి పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులతోపాటు ఏదైనా ఆమోదిత గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చని చెప్పారు.

# హాస్టళ్ల తీరు అధ్వాన్నం

### వైఆకాపా హయాంలో రూ.7,245 కోట్లు ఖర్చు
### చంద్రబాబు కేవలం రూ.455 కోట్లే ఖర్చు చేశారు
### హాస్టళ్లలో దారుణ పరిస్థితులు ఉన్నా పట్టించుకోరా
### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైకాపా నేత టిజెఆర్ సుధాకర్

అమరావతి,ఫిబ్రవరి10:
వైఎస్ జగన్ హయాంలో హాస్టల్స్ ఎలా ఉన్నాయో చంద్రబాబు చూసి తెలుసుకోవాలని వైసిపి నేత టిజెఆర్ సుధాకర్ అన్నారు. జగన్ హయాంలో హాస్టల్స్ కు రూ.7,245 కోట్లు ఖర్చు చేశారు. 2014-19 మధ్యలో చంద్రబాబు కేవలం రూ.455 కోట్లే ఖర్చు చేశారు. దాన్నిబట్టే సంక్షేమ హాస్టల్‌లో ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ ప్రతిరోజూ మంచి భోజనం పెట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టీజేఆర్.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. చంద్రబాబు ఎంతసేపూ పబ్లిసిటీ చేసుకోవటమే తప్ప విద్యార్థులకు ఏం న్యాయం చేశారు?, హోంమంత్రి అనిత హాస్టల్‌లో తిన్న భోజనంలోనే బొద్దింక వచ్చినా పద్దతి మార్చు కోలేదు. ఇప్పటికి 18 సంఘటనల్లో వేలాది మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థుల అవస్థలను పట్టించుకోరా?, పోలవరం జిల్లాలో 89 మంది ఆస్పత్రి పాలయితే ప్రభుత్వం ఏం చేస్తోంది?, విద్యార్థుల అవస్థలు మీ హైటెక్ ప్రభుత్వానికి తెలియటం లేదా?, గిరిజనులు, దళితులంటే ఎందుకంత కక్ష అంటూ విమర్శలు గుప్పించారు. అన్ని రకాల వస్తువులకూ ధరలు విపరీతంగా పెరిగి జనం అవస్థలు పడుతున్నారు. కానీ అభివృద్ధి, సంక్షేమం అద్భుతమని చంద్రబాబు తనకు తానే చెప్పుకుంటున్నారు. మీ పాలన ఎలా ఉందో కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డే తేల్చి చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను చంద్రబాబు అమ్మేయపోతే జగన్ అడ్డుకున్నారు. ఇప్పటికీ అక్కడి ఉద్యోగులు భయంగానే బతుకుతున్నారు. అమరావతిలో రైతులను నిలువునా మోసం చేసారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం తప్ప రాజధానిలో ఏం జరుగుతోంది?, చంద్రబాబు చీకటి ఎత్తుగడలకు రైతులు అన్యాయం అవుతున్నారు. రూ.76 వేల కోట్లు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపుతున్నా నిర్మాణాలు మాత్రం కనపడటం లేదన్నారు. రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లు ఎప్పుడు ఇస్తారు?, ఏఐ టెక్నాలజీ అని చెప్తూ మరి ఆ మేరకు పాఠ్యపుస్తకాలను ఎందుకు రూపొందించ లేదు?, టెక్నాలజీ ఉండాలిగానీ మితి మీరిన టెక్నాలజీ అవసరం లేదు. ముందు ఆకలితో ఉన్న వాడికి తిండి పెట్టండి. 23 లక్షల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో చంద్రబాబు చెప్పాలి. చంద్రబాబు అవుట్‌డేటెడ్ సీఎం. ఆయన ఆలోచనలు మారాలి. హెరిటేజ్ పెరుగు నాసిరకం అని ల్యాబులు నిర్ధారించాయి. సబ్ స్టాండర్డ్ అని తేల్చి చెప్పాయి. నాసిరకం పెరుగు విక్రయించినందుకు హెరిటేజ్ సంస్థ పెనాల్టీ కట్టింది. ఇలాంటి పనులు చేసినందుకు చంద్రబాబు సిగ్గు పడాలని మండిపడ్డారు.

# దేవడుని అడ్డం పెట్టుకుని బాబు అబద్ధాలు

### వాటిని తిప్పి కొట్టడానికే రోజూ మాట్లాడుతున్నాం
### చంద్రబాబుకు స్వామి వారి శిక్ష తప్పదని గుర్తించాలి
### వైసిపి అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

కడప,ఫిబ్రవరి10:
ముఖ్యమంత్రి చంద్రబాబు.. దేవుడిని అడ్డుపెట్టుకుని కుట్రలో అబద్దాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు . బరితెగించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూనే ఉన్నారని అన్నారు. బోలేబాబా సంస్థకు అనుమతి ఇచ్చింది మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వచ్చింది చంద్రబాబు పాలనలోనే ?అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. శివప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'మేము అబద్దాల కోరు చంద్రబాబుతో కొట్లాడుతున్నాం. ప్రతిరోజూ ఆయనతో కొట్లాడకపోతే ఆయన చెప్పే అబద్ధం ప్రపంచం అంతా తిరుగుతుంది. అందుకే మేము తిరుమల పవిత్రతపై రోజూ మాట్లాడాల్సి వస్తోందని అన్నారు. కేవలం హిందువుల్లో జగన్ పట్ల వ్యతిరేకత రావాలనే చంద్రబాబు దుష్ప్రచారానికి దిగాడు. దేవుడిని కూడా అడ్డు పెట్టుకుని కుట్రలకు తెర లేపారు. జంతువుల కొవ్వు కలిసింది అని మొట్టమొదటి అబద్దం చెప్పాడు. స్వామి వారి పవిత్రతకు భంగం కలగకుండా ఉండాలి అనుకుంటే ఈ విషయం మాట్లాడరని అన్నారు. గోప్యంగా విచారణ చేసి నిజాలు తేలిన తర్వాత ఏదైనా ఉంటే అప్పుడు ప్రకటన చేయాలన్నారు. సీబీఐ రిపోర్టు కాదని ఏకసభ్య కమిషన్ ఎలా వేస్తారు?. సీబీఐ దర్యాప్తు తర్వాత ఏకసభ్య కమిషన్ వేయడమేంటి?. భోలే బాబా ఫ్రాడ్ అయినప్పుడు 82వేల కేజీల నెయ్యి ఎలా ఆర&ధర్ ఇచ్చారు. ఎన్‌డీడీబీ, ఎన్డీఆర్ఐ రిపోర్టులే సరికాదని ఎలా చేప్తావు చంద్రబాబు?. బాబూ నీకు ఆత్మే లేనప్పుడు అంతరాత్మ సాక్షిగా ప్రమాణం ఏంటి?. వైఎస్ జగన్ హయాంలో నెయ్యి నాణ్యతలో ఎక్కడా పొరపాటు చేయలేదు. బరితెగించి నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూనే ఉన్నావని మండిపడ్డారు. సీబీఐ సిట్ చెప్పినా, ల్యాబ్స్ చెప్పినా నారా వారి మాటే కరెక్ట్ అనాలని కోరుకుంటున్నారు. మళ్ళీ ఏకసభ్య కమిషన్ అంటున్నారు.. సీబీఐ విచారణ చేసినా వీళ్లు ఒప్పుకోవడం లేదు. పాలే లేకుండా పెరుగు తయారు చేసినందుకు నీ హెరిటేజ్ సంస్థకు లక్ష రూపాయలు జరిమానా కట్టావు. దీనికి ఫుల్ స్టాప్ పడాలంటే ఒక్కటే మార్గం.. దేవదేవుడైన వెంకటేశ్వర స్వామి ఇక నిరూపించుకోవాలి. దీనికి మేము జంతు కొవ్వు కలిపితే మా చేతులు పడిపోవాలి. జంతు కొవ్వు కలవకపోతే చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ నోరు పడిపోవాలి. మీ ముగ్గురికి ఆ వెంకటేశ్వర స్వామి శిక్ష తప్పకుండా విధిస్తాడు. స్వామి వారికి నువ్వు చేసిన అపచారానికి కచ్చితంగా శిక్ష పడుతుంది. నీ జీవితంలో 2029 తర్వాత నువ్వు, నీ కొడుకు ముఖ్యమంత్రి అయ్యేది లేదు. ఆ తర్వాత నీ జీవితంలో మంచి రోజులే ఉండవు. నీకు స్వామి వారి పట్ల భక్తి లేదు.. ప్రజల మనోభావాలపై గౌరవం లేదు అంటూ ఘాటు విమర్శలు చేశారు.

# దిక్కుమాలిన సర్కార్..
# ఉన్న హక్కులనూ కాపాడలేని అసమర్థ ప్రభుత్వమిది : హరీశ్


హైదరాబాద్, ఫిబ్రవరి 10 :
ఏపీ సర్కార్ కృష్ణా జలాలను అడ్డగోలుగా కొల్లగొడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీళ్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నట్టు? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇండెంట్లు, బోర్డు అనుమతులు లేకుండా అక్రమంగా.. అప్పనంగా 80 శాతం నీళ్లను తరలించుకుపోతుంటే కండ్లు మూసుకున్నరా? అని మండిపడ్డారు. జనవరి 28 నాటికే ఏపీ 664 టీఎంసీలు వాడుకున్నదని, ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుందని, వెంటనే బోర్డు మీటింగ్ పెట్టి ఏపీ నీటి దోపిడీని ఆపాలని తెలంగాణ ఈఎన్సీ కేఆర్ఎంబీకి లేఖ రాసినా, ఇటు రాష్ట్ర ప్రభుత్వం, కృష్ణాబోర్డు పట్టించుకోలేదని నిప్పులు చెరిగారు. ఇప్పటికీ ఏపీ ప్రతిరోజూ శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఒకటిన్నర టీఎంసీల నీటిని అప్పనంగా తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లప్పగించి చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సీఎం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ కోసం ఎందుకు అడగడం లేదు? ఆర్ఆర్ ట్యాక్స్ ఎకడ బయటకు వస్తదో, సామ్‌లు ఎకడ బయట పడుతయోనని భయపడుతున్నారా?' అని ప్రశ్నించారు.
తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే ఇద్దరు కేంద్ర మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. 'నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరు?' అని ప్రశ్నించారు. తక్షణమే ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని, త్వరలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో మంగళవారం శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, పార్టీ నేత బొమ్మెర రామ్మూర్తితో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నా జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని సీఎం కండ్లప్పగించి చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను ఊరికే రాజకీయ ఆరోపణలు చేయడం లేదని, పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని, ఇందుకు సంబంధించిన లేఖలను మీడియాకు చూపించారు.

ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా?
తాతాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని, ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుందని తెలంగాణ ఇరిగేషన్‌శాఖ శాఖ ఈఎన్సీ జనవరి 28న కేఆర్ఎంబీకి లేఖ రాశారని హరీశ్ చెప్పారు. వెంటనే బోర్డు మీటింగ్ పెట్టి, ఏపీ నీటి దోపిడీని ఆపాలని ఈఎన్సీ రాసిన లేఖను మీడియాకు అందించారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నారని, గాడిద పండ్లు తోముతున్నారా? అని ప్రశ్నించారు. లేఖ రాసిన ఈఎన్సీ జనవరి 31న రిటైర్ అయ్యారని, లెకకు మించిన నీళ్లు ఏపీ తీసుకుపోతుంటే వారం దాకా ఆ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయలేదని, ఇన్‌చార్జి బాధ్యతలు మరెవరికీ అప్పగించలేదని విమర్శించారు. 'కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఈఆర్ఎంబీ) సభ్యుడు అయిన ఈఎన్సీ పోస్టును ఎందుకు ఖాళీగా పెట్టారు? వాటా కుదరలేదా? కమీషన్లు కుదరలేదా?' అని ప్రశ్నించారు. వారం తర్వాత మీడియా ప్రశ్నిస్తే అప్పుడు ఆ పోస్టు నింపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రయోజనాలపై సర్కార్ ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందా? అని ప్రశ్నించారు.

అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌కు అడుగరెందుకు?
బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఏపీ 66 శాతమే నీటిని వాడాల్సి ఉన్నదని, కానీ, ఈ వాటర్ ఇయర్‌లో జనవరి 29 నాటికే 664 టీఎంసీలు (80 శాతానికిపైగా) నీటిని తరలించుకుపోయిందని హరీశ్ విమర్శించారు. అయినా రేవంత్‌రెడ్డి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఉత్తరాలు రాయడం తప్ప ఏం చేస్తున్నారని నిలదీశారు. గురువు చంద్రబాబు అంటే రేవంత్‌కు భయమని, అందుకే ముఖ్యమంత్రి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ కోసం అడుగడం లేదని దుయ్యబట్టారు. ఏపీ నీళ్లు తరలించుకుపోతుంటే శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఖాళీ అవుతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకున్నదని మండిపడ్డారు. ఎండలు ముదురుతున్నాయని, తెలంగాణకు పారిశ్రామిక, వ్యవసాయ, తాగునీటి అవసరాలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా? అని నిలదీశారు. తాతాలికంగా అయినా మన రాష్ట్రానికి 174 టీఎంసీలు (34 శాతం నీటి వాటా) వాడుకునేది ఉన్నదని, అయినా వినియోగించుకున్నది 20 శాతం వాటా మాత్రమేనని విమర్శించారు. ఏపీ ఇప్పటికీ అక్రమంగా రోజూ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మన పంటలు ఏం గావాలె? మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం గావాలె? సరార్ నడుపుతున్నరా? సరస్ నడుపుతున్నరా?' అని మండిపడ్డారు.

ఈ రెండేండ్లలోనే అత్యల్ప నీటివాడకం
కృష్ణా జలాల వినియోగంలో బీఆర్ఎస్ పాలనతో పోల్చితే కాంగ్రెస్ హయాంలోనే అతి తక్కువ వాడుకుంటున్నామని హరీశ్ విమర్శించారు. వరుసగా రెండేండ్లుగా అతి తకువ కృష్ణా జలాలను వాడుకుంటూ చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని మండిపడ్డారు. అసెంబ్లీలో కూడా ఇదే అంశాన్ని ఆధారాలతోసహా వివరించామని, అయినా, ఈ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో 45 శాతం, 35 శాతం వాడితే, రేవంత్‌రెడ్డి పాలనలో ఈ ఏడాది కూడా 20 శాతం నీటి వాటా దాటలేదని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి వైఫల్యానికి నిదర్శనమని, ముఖ్యమంత్రే ఈ రాష్ట్రం పాలిట శాపంగా మారాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తల్లే దయ్యమైనట్టు హకులు కాపాడాల్సిన ముఖ్యమంత్రే తెలంగాణ హకులను కాలరాస్తున్నారని వాపోయారు. 'పాలన మీద పట్టు లేదు.. పట్టింపు కూడా లేదు' అని మండిపడ్డారు. 'కేఆర్ఎంబీకి లేఖ రాసి మేం చెప్పిన ఏపీ నీటి వినియోగం వాస్తవం అని ఒప్పుకొన్నరు. ఏపీ అడ్డగోలుగా నీళ్లు వాడుతున్నది అడ్డుకోవాలని ఇప్పుడు కేఆర్ఎంబీకి లేఖ రాసింద్రు. మేం ప్రశ్నించినప్పుడే మీరు నిద్ర లేచి బాధ్యతగా వ్యవహరించి ఉంటే తెలంగాణకు ఇంత నష్టం అవుతుండేనా? నామమాత్రంగా లేఖ రాయడం తప్ప మీరు చేస్తున్నదేం లేదు. తెలంగాణ కోసం మమ్మల్ని తిట్టినా పడుతం. కానీ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం వాటిల్లితే మాత్రం ఊరుకోబోం' అని హెచ్చరించారు.

నీళ్ల తరలింపును ఆపాలి
రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల దోపిడీని, అక్రమ తరలింపును వెంటనే అడ్డుకోవాలని హరీశ్ డిమాండ్ చేశారు. 'ఎంతసేపూ కేసీఆర్ మీదపడి ఏడ్వడం కాదు.. ఆ కుర్చీల్లో కూర్చున్నందుకు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి. క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలి. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. త్వరలో కేఆర్ఎంబీ ఆఫీస్‌ను ముట్టడిస్తాం. కేంద్ర మంత్రిని కూడా



కలుస్తాం. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తుతాం. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు 16 మంది ఉండి తెలంగాణ హకులను కాపాడటంలో ఫెయిల్ అయ్యారు. తెలంగాణ నీటి హకుల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తది' అని స్పష్టంచేశారు. 19 ప్రాంతాల్లో బీఆర్ఎస్ టెలిమెట్రీలు పెట్టిందని, మిగతా 9 ప్రాంతాల్లో పెట్టాలని కోరామని గుర్తుచేశారు. టెలిమెట్రీలు పెట్టకపోగా, ఇందుకోసం కేటాయించిన నిధులను కేంద్రం వాడుకున్నా ప్రశ్నించడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో 13 లక్షల ఎకరాలకు నీళ్లందిస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ లక్ష ఎకరాలకు కూడా నీళు ఇవ్వలేకపోతున్నదని విమర్శించారు. ప్రాజెక్టులు, ఆయకట్టు అదనంగా అందుబాటులోకి వచ్చినా నీటి వాడకంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

బీజేపీ మంత్రులు ఎందుకు అడుగరు?
664 టీఎంసీలు ఏపీ తీసుకుపోయిందని ఈఎన్సీ కేఆర్ఎంబీకి లేఖ రాస్తే, కేఆర్ఎంబీ రాసిన లేఖలో 555 టీఎంసీలు తీసుకుపోయిందని ప్రస్తావించిందని, వంద టీఎంసీలు తకువ చేసి చెప్తున్నదని హరీశ్ విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడగడం లేదని, హకులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ చేతిలో ఉన్న కేఆర్ఎంబీ తీరుపై రాష్ట్రం నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.
'కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్ప.. నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరు?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆర్ఆర్ ట్యాక్స్ ఎకడ బయటకు వస్తదో, సామ్‌లు ఎకడ బయట పడుతయోనని రేవంత్ మౌనంగా ఉంటున్నడు. బీజేపీ కూడా అట్లాగే మౌనంగా ఉంటున్నది. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నయి. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోర్లు కొడుతున్నరు. తెలంగాణ పొలాలు బీళ్లుగా మారుస్తున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి? రేవంత్, కిషన్‌రెడ్డి కలిసి తెలంగాణ బొండిగె పిసుకుతరా? ఇద్దరు కేంద్రమంత్రులుండీ ఏం చేస్తున్నట్టు? కేబీఆర్ఎంబీపై కనీసం రివ్యూ చేయరా? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హకులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ధ్వజమెత్తారు.

## నాటి పరికరాలతో

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

ఖమ్మం:
భారాస హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన ఆ పార్టీ నాయకులు.. నాటి పరికరాలతో ఇప్పటికీ తమ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఆ పరికరాలు ఎవరింట్లో, ఏయే ఫాంహౌస్‌లలో దాచారో, ఎంతమంది ఫోన్లను అక్రమంగా వింటున్నారో విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖమ్మంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉద్యోగులు ఓటర్లు కాదా.. పార్టీ కోసం ఓటేయాలని వారిని అడగటంలో తప్పేంట'ని మంత్రి ప్రశ్నించారు. ఉద్యోగులతో తాను జరిపిన ఫోన్ సంభాషణను ఖమ్మంలో భారాస నాయకులు విడుదల చేయటంపై ఆయన ఈ విధంగాస్పందించారు. మంత్రిగా ఉద్యోగులతో సమీక్షలు జరుపుతానని, అలా వారితో ఫోన్‌లో మాట్లాడిన అంశాలు భారాస నాయకులకు తెలిశాయంటే.. తమ ఫోన్లను ఇప్పటికీ ట్యాపింగ్ చేస్తున్నట్టేనని పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 పురపాలికలు, ఏడు కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్ జరగనుందని, కాంగ్రెస్ పార్టీ 80 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు అసలు, వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి కుంటుపడకుండా పేదల అభ్యున్నతి, సంక్షేమం విషయంలో చెప్పిన మాటలన్నీ నెరవేర్చటంతోనే శాసనసభ ఉప ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తమ అభ్యర్థులను గెలిపించారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవబోతోందనే నిజాన్ని జీర్ణించుకోలేక భారాస నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని.. ఏప్రిల్ నుంచి రెండో విడత, తరువాత మూడో విడత ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఇటీవల సీపీఐ నేత నారాయణ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తాను సీఎం రేసులో లేనని, సామాన్య కార్యకర్తనేనని స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల కోసం
# సీఎం సొంత జిల్లాలో దౌర్జన్యాలు

ఢిల్లీ:
నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో భాజపా కౌన్సిలర్ అభ్యర్థి మహాదేవప్ప మృతి విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లోక్‌సభ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన సభలో ఈ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడారు. "తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే అనేక దౌర్జన్యాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు, డబ్బుల పంపిణీ వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. దీన్ని సభ ఖండించాలి" అని కిషన్‌రెడ్డి కోరారు.
తర్వాత ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. "మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు భాజపా అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప మృతి బాధాకరం. పార్టీ జాతీయ అధ్యక్షుడు కూడా ఈ ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మా అభ్యర్థులను బెదిరింపులకు గురి చేసి, అనేక మున్సిపాలిటీల్లో దౌర్జన్యానికి పాల్పడుతోంది. మక్తల్‌లో జరిగిన భాజపా ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మా పార్టీ గెలుస్తుందనే భయంతో.. ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడంతో కాంగ్రెస్ కుట్రలు పన్నింది. ఇందులో భాగంగానే మహాదేవప్పపై తీవ్ర ఒత్తిడి చేయడం, భయపెట్టడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రచారం చేయకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం, బెదిరించడం చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కానీ, న్యాయవిచారణ కానీ జరపాలి. 15 రోజులుగా కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి కారణంగానే తన భర్త చనిపోయారని మహాదేవప్ప భార్య స్పష్టంగా ఫిర్యాదు చేశారు. ఈ ఎన్నికల్లో భాజపా, కాంగ్రెస్‌ల మధ్యనే తీవ్రమైన పోటీ ఉంది. భాజపా గెలుపును అడ్డుకోవాలనే ఉద్దేశంతో త్రికోణపోటీ ఉందని చెబుతున్నారు. భారాస, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లకు భారీగా డబ్బులు వెదజల్లుతున్నాయి.
తన పేరు రేవంత్‌ఖాన్ అని గర్వంగా చెప్పుకొన్న ముఖ్యమంత్రి.. తన అవసరాల కోసం శాశ్వతంగా పేరు మార్చుకున్నా, మతం మార్చుకున్నా మాకు అభ్యంతరం లేదు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా.. స్టీరింగ్, హారన్, ఎక్సలరేటర్ నా చేతుల్లో ఉన్నాయంటూ గతంలో అసదుద్దీన్ ఒవైసీ బహిరంగంగా చెప్పారు. కాంగ్రెస్, భారాస రెండూ మజ్లిస్‌కి బానిసలుగా బతుకుతున్నాయి. తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని దారుస్సలాంలో తాకట్టు పెట్టిన ఘనత ఈ రెండు పార్టీలదే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అధికారంలోకి వస్తే.. భారాస, కాంగ్రెస్‌ల హయాంలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై విచారణ జరుపుతాం" అని కిషన్‌రెడ్డి ప్రకటించారు.

# సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్

ఢిల్లీ:
ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మ విశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన 'బస్తర్ పండుమ్'పై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో బస్తర్ ప్రాంతపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'గతంలో బస్తర్ అనగానే మావోయిజం, హింస, వెనుకబాటుతనం గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు బస్తర్ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. స్థానిక ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఈ ప్రాంతం భవిష్యత్తులోనూ శాంతి, ప్రగతి, సాంస్కృతిక గౌరవంతో నిండి ఉండాలని నేను ఆశిస్తున్నాను' అని 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు పెట్టారు. ఈ నెల 7న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించిన ఈ ఉత్సవం, గిరిజనులు హస్తకళలు, స్థానిక వంటకాలు, సంప్రదాయ గిరిజన నృత్యాలు, జానపద గీతాలతో బస్తర్ వైభవాన్ని చాటి చెప్పింది.

## అప్పుల బాధతో

# చిరుద్యోగి ఆత్మహత్య

### కూతరు పుట్టిన రోజే ఉరేసుకుని మృతి

అన్నమయ్య,ఫిబ్రవరి9:
ఆఫీసుకు వెళ్తున్నా సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు బిడ్డ పుట్టినరోజుకు బర్త్‌డే కేక్ తీసుకొస్తానని అని చెప్పిన భర్త కానరాని లోకానికి వెళ్లిపోయాడు. పుట్టినరోజుకు కేక్ తీసుకొస్తాడని వెళ్లిన నాన్న ఇంకెప్పటికి కేక్ తీసుకురాలేడని ఆ బిడ్డకు, సాయంత్రం తిరిగి వస్తానని చెప్పిన వెళ్లిన భర్త ఇక మాటలు ఇక వినబడవని తెలిసి ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. నీకు..బిడ్డలకు నరకాన్ని ఇచ్చి వెళ్లిపోతున్నా అని భార్యకు మెసేజ్ పెట్టి ఆత్మహత్యకు పాల్బడిన భర్త గురించి గంటల వ్యవధిలో మరణవార్త వినడం ఆ కుటుంబాన్ని కలచివేసింది. అభంశుభం తెలియని ఇద్దరు ఆడపిల్లలు, భార్య తనపై ఆధారపడి ఉన్నారన్న విషయం తెలిసినా, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్బడిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సుబ్రమణ్యం (36) ఉదంతం ఆవేదనకు గురి చేస్తోంది. సోమవారం ఉదయం బి.కొత్తకోటలో చోటుచేసుకున్న ఈ ఉదంతానికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. రామసముద్రానికి చెందిన బి.సుబ్రమణ్యం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గతేడాది జూలైలో బి.కొత్తకోట నగర పంచాయతీ తాకాటంవారిపల్లె సచివాలయానికి బదిలీ అవ్వగా స్థానిక బైపాస్‌రోడ్డులో కుటుంబంతో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య సౌమ్య, ఐశ్వర్య (4), హైందవి (2) సంతానం. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు కావడంతో సుబ్రమణ్యం కుటుంబంతో కలిసి బి.కొత్తకోట సమీపంలోని కర్ణాటకకు చెందిన నాగిరెడ్డిపల్లెలోని అత్తారింటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండగా సోమవారం ఉదయం ఏడు గంటలకు ఆఫీసుకు బి.కొత్తకోట వెళ్తున్నానని, కుమార్తె ఐశ్వర్య జన్మదినం కావడంతో సాయంత్రం వచ్చేటప్పుడు కేక్ తీసుకొస్తానంటూ చెప్పి ఉదయం ఏడు గంటలకు నాగిరెడ్డిపల్లె నుంచి బి.కొత్తకోటకు బయలుదేరాడు. ఇంటికి చేరుకున్న తర్వాత 7.50 గంటలకు రామసముద్రంలో ఉంటున్న తల్లి నీలమ్మతో ఫోన్‌లో మాట్లాడాడు. ఈ రోజు బిడ్డ ఐశ్వర్య పుట్టినరోజని కేక్ తీసుకోవాలని చెబుతూనే ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయని భారంగా మాట్లాడాడు. డబ్బులు లేవని, ఇబ్బందులు పడుతున్నట్టుగా చెప్పుకున్నాడు. ఈ మాటలకు ఆందోళనకు గురైన నీలమ్మ విషయాన్ని కోడలు సౌమ్యకు చెప్పడంతో 8 గంటలకు భార్య సౌమ్య, తల్లి నీలమ్మ, కుటుంబీకులు ఫోన్‌లో మాట్లాడేందుకు కాల్ చేసినా తీయలేదు. ఆత్మహత్యకు సిద్దంకావడంతో అంతకుముందు భార్య సౌమ్య ఫోన్‌కు..నీకు, బిడ్డలకి నరకాన్ని ఇచ్చి నేను వెళ్లిపోతున్నాను క్షమించండి అంటూ భార్య ఫోన్ నంబర్‌కు మెసేజ్ టైప్ చేశాడు కాని సెండ్ చేయలేదు. ఆ తర్వాత ఇంటిలోనే శ్లాబుకు ఉన్న కొక్కికి వేసిన చీర, తాడుతో ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్బడ్డాడు. ఉదయం ఆత్మహత్యకు పాల్బడినట్టుగా పోలీసులు గుర్తించారు. సుబ్రమణ్యం ఆత్మహత్యకు పాల్బడిన విషయాన్ని స్థానికులు గుర్తించి ఇంటి యజమానికి, పొరుగు వాళ్లకు చెప్పడంతో వారు ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ కరీముల్లా సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారించారు. ఆర్థిక సమస్యలతో తమతో చెప్పుకోలేని ఆత్మహత్యకు పాల్బడినట్టు పేర్కొనడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# తెలుగు మృత భాష కాదు అమృత భాష

## ఓయూ తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు హాజరైన విదేశీ తెలుగు ప్రతినిధులు



**ఏ ఎం న్యూస్ ఓయూ :**
తెలుగు మృతభాష కాదని అమృత భాష అని వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండవ రోజు ఆర్ట్స్ కళాశాల లలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించారు. రూమ్ నెంబర్ 121 లో మంగళవారం " దేశ విదేశాలలో " తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి- మార్గదర్శనం" అనే అంశంపై పద్మ విభూషణ్ సంజీవ నరసింహ అధ్యక్షతన చర్చను నిర్వహించారు. జయ పీసపాటి మాట్లాడుతూ హాంకాంగ్ లో తాము తెలుగు ఫెస్టివల్ ను నిర్వహించడంతోపాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యం లను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తు న్నామని చెప్పారు. అమెరికా న్యూయార్క్ నుంచి హాజరైన గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా తాము తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని చెప్పారు. పద్యాలు, లలిత గీతాలు, నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింప చేశామని కల్వల విశ్వేశ్వర్ చెప్పారు. 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరిం చారు. ఆస్ట్రేలియా నుంచి హాజరైన విజయ మాట్లాడుతూ ప్రతి శనివారం రెండు గంటలపాటు తాము తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు . తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నా మన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీ నుంచి హాజరైన గణేష్ తొట్టిపూడి మాట్లాడుతూ సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వడ్లమాని దుర్గ, జంధ్యాల కిషోర్ శరత్ బాబు లు మాట్లాడుతూ బాల్యం నుంచే తెలుగు భాష పై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మూర్తి రేమిళ్ళ, వెల్మల కృష్ణారావు,నరసింహులు మరాఠీ ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ జయకృష్ణ కిషోర్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెవిఎన్‌డి ప్రసాద్ సగిలి సుధారాణి తదితరులు ప్రసంగించారు. "తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం" అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆచార్య వై రెడ్డి శ్యామల అధ్యక్షత వహించారు. ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆన్లైన్లో తెలుగు భాషా బోధన గురించి డాక్టర్ ఝాన్సీ ఉడుము, తెలుగు భాషా పరివ్యాప్తికి మార్గాలు అనే దానిపై సిరికొండ నరసింహ రాజు, తెలుగులో సాంకేతిక అభివృద్ధి- సాంకేతిక వినియోగం పై రెహమానుద్దీన్ షేక్, తెలుగు పరిశోధనలలో శాస్త్ర సాంకేతికత వినియోగంపై దాసరి కరుణలు ప్రసంగించారు. రూమ్ నెంబర్ 133లో జరిగిన సదస్సు తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండో రోజు మంగళవారం



రూమ్ నెంబర్ 133లో " సోషల్ మీడియా లైక్స్, షేర్స్, వైరల్ సాహిత్యం" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. రాజీ కన్నా, చరణ్ పరిమి,అమృతరాజ్,సాత్వికలుఈఅంశంపై ప్రసంగించారు. అలాగే 'యువ రచయితల సాహిత్యం- గమనం, గమ్యం" అనే అంశంపై సాయి వంశీ, శివశంకర్, ఉదయ్, రాము వేర్ల వెంకట నారాయణ, విమలలు ప్రసంగించారు. సీనియర్ రచయితల నుంచి మేమేం కోరుకుంటున్నాం అనే అంశంపై దండ వెంకట రాములు, బాలు అగ్నివేష్, హతి రామ్, ధరణిలు ప్రసంగించారు.

# యువతలో సాహిత్య అధ్యయనం పెరగాలి

- వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్
-ఓయూలో ముగిసిన తెలంగాణ లిటరరీ కాంగ్రెస్
- ఓయూలో కవిత జిందగీ.. కవిత దునియా
- హాజరైన గోరటి వెంకన్న




**ఏ ఎం న్యూస్ ఓయూ:**
తెలంగాణ రెండవ లిటరరీ కాంగ్రెస్‌ను పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు "కవితా జిందగీ- కవిత దునియా" కార్యక్రమం పేరుతో మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువ కవుల కవిత్వ పఠనంతో పాటు పాటలను పాడటం జరిగింది. విద్యార్థినీ విద్యార్థుల కవిత్వం, గానాలతో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం లోని ఆహుతులను ఆకట్టుకుంది. జానపద గాయకురాలు రోజా రమణి తన గొంతుతో విద్యార్థులను ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో గాయకులు చ రణ్ అర్జున్, రాము రాథోడ్ తమ పాటలతో విద్యార్థులను కేకలు పెట్టించారు. గోరటి వెంకన్న, వరంగల్ శ్రీనివాస్ మాట.. పాటతో విద్యార్థుల ను ఉత్సాహ పరుస్తూ సాహిత్య అభిలాషను కల్పించారు. తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాసిం తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ ను విజయవంతం చేయడంలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ పత్రాలు సృష్టించి మహిళా సంఘం భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని

# కబ్జా చేస్తున్న వ్యక్తిపై విచారణ జరిపించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి




### తహశీల్దార్ మరియు ఎంపిడిఓలకు పిర్యాదు చేసిన దత్తాయపల్లి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్

**ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట :**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణం కోసం కేటాయించిన సర్వే నంబర్ 77 లోని 150 గజాల స్థలంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం మరియు గ్రామ పెద్దలు,మహిళలలు,ప్రజ పందరి సమక్షంలో చేసిన తీర్మానాన్ని ధిక్కరించి గ్రామానికి చెందిన ధ్యాన బోయిన సత్యనారాణ గారు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నట్లు సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ తన పాలక వర్గ సభ్యులు గ్రామ పెద్దలతో కలిసి తుర్కపల్లి మండల తహసీల్దార్ జల కుమారికి మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గీతా రెడ్డికి ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడాడు కోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై మరియు అధికారులపై ఉన్నదని తెలిపారు వెంటనే సంబంధిత విషయం పై పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రభుత్వ అధికారుల సంతకాలను స్టాంపులను ఫోర్జరీ చేసి అట్టి స్థలంలో హద్దురాళ్లు లేకున్న ఉన్నట్లు ఫోటోలలో సృష్టించి కోర్టులను కూడా తప్పు దోవ పట్టిస్తున్న పై వ్యక్తిపై చట్టపరమైన విచారణ జరిపి మహిళా సంఘం భవన నిర్మాణంకు కేటా యించిన స్థలాన్ని విముక్తి కల్పించాలని కోరారు ఈ కార్యక్ర మంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ధ్యాన బోయిన బొందయ్య,గుంటి మల్లేష్ యాదవ్,ధ్యాన బోయిన పోచయ్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు,నల్ల రాజు, ధ్యాన బోయిన నవీన్, గుంటి రాజు తదితరులు ఉన్నారు.

# మూడు విగ్రహాలు పెట్టే వరకు పోరాడుతాం

- తెల్లాపూర్ వాసులు..

**ఏ ఎం న్యూస్, పటాన్చెరు:**
ఏమి జరుగుతుందో తెలియక, ఎటు పోతుందో తెలియని ప్రజా స్వామ్య వ్యవస్థలో ఉన్నామా మనం, విగ్రహాలను కాలి తో తన్నే సాంప్రదాయాలు కొత్తగా వస్తున్నాయా, ఎవరి భక్తి వారిది, ప్రజాస్వామ్యంలో కాలితో విగ్రహాన్ని తన్నడం నూతన వరవడికి శ్రీకారం చుట్టబోతున్నదా, కాలితో తన్నిన వారిని ప్రజాస్వామ్యంలో ఏ విధంగా శిక్షించాలి అనే ప్రశ్నలకు సమాధానం తెల్లాపూర్ సర్కిల్. విషయానికొస్తే గత నెల( జనవరి 2026) 25వ తారీకు సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ సర్కిల్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు శివాజీ అభిమానులు, గ్రామస్తులు. ఈనెల 6(ఫిబ్రవరి 2026) తారీకు జ్యోతి బాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు జ్యోతిరావు పూలే అభిమానులు, గ్రామస్తులు. అన్నదమ్ముల్లా కలిసి ఉండే తెల్లాపూర్ గ్రామస్తులు గత ఏడు సంవత్సరాల కింద వారందరూ కలిసి తెల్లాపూర్ సర్కిల్ వద్ద జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్, సావిత్రి బాయి పూలేతో పాటు ఛత్రపతి శివాజీ విగ్రహలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆన వాయితీగా ఎవరి విగ్రహాల వద్ద వారు జయంతులు, వర్ధంతులు చేసు కుంటూ వారి అభిమానిని చాటుకుంటూ వస్తున్నారు. మరి సమస్య ఎక్కడ వచ్చింది. 15 రోజుల కిందట రాత్రికి రాత్రే చత్రపతి శివాజీ విగ్రహం పెట్టడం, ఆ విగ్రహానికి ముఖ్య అతిథు లుగా ఎంపీ (ఇతర పార్టీలకు సమాచారం ఇవ్వకుండా) ఇంత అత్యవ సరంగా పూజలు చేయటం ఏమిటి అని తెల్లాపూర్ వాసులు చర్చించుకున్నారు. గ్రామస్తులు నిర్ణయించుకొని మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని గ్రామస్తుల సమక్షంలో తెల్లాపూర్



సర్కిల్‌లో ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ ఐక్యతగా ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అనుకునే లోపులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కొంతమంది కాళ్లతో తన్నడం ప్రత్య క్షంగా చూసి సహించలేకపోయారు గ్రామస్తులు. తల్లి మీద నో, తండ్రి మీద నో దాడి చేస్తే ఊరుకోం కదా, అని గ్రామస్తులు అన్నారు. కాలితో తన్నిన వారికి శిక్ష దించే వరకు మేము పోరాడు తామని అన్నారు ఈసందర్భంగా మంగళవారం (10/2/2026) మీడియా సమావేశం ఏర్పాటు చేశారు మహాత్మా జ్యోతిరావు పూలే అభిమానులు, గ్రామస్తులు. ఈ మీడియా సమావేశానికి వచ్చిన సమాజానికి నాలుగో స్తంభమైన మీడియా నిర్వాహకుల పై పోలీస్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు అని మీడియా నిర్వాహకులు తెలిపారు. అనంతరం జరిగిన మీడియా సమా వేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ శివాజీ విగ్రహం పెట్టడానికి మాకు అభ్యంతరం లేదు, గత ఏడు సంవత్సరాల కిందటనే మూడు విగ్రహాలను పెట్టాలని గ్రామస్తుల సమక్షంలో నిర్ణయిం చు కున్నామని మూడు విగ్రహాలు( ఇప్పుడు పెట్టిన మహాత్మ జ్యోతిరావు పూలే, మహాత్మ సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ) పెట్టేంత వరకు ఈ పోరాటం ఆగదు అని అన్నారు. గ్రామస్తులందరం ఏకతాటిపై ఈ విగ్రహాల స్థాపనకు కట్టుబడి ఉంటామని అన్నారు. తెల్లాపూర్ తెలంగాణకు దిక్సూ చిలా ఉండాలి అని మేము మా గ్రామస్తులము అందరం కోరుకుం టున్నామని అన్నారు. విగ్రహాల వద్ద రాజకీయాలు చేయటం ఎంతవరకు సమంజసమని, సస్యశ్యామలంగా తెల్లాపూర్ గ్రామం ఉండాలని గ్రామస్తులు అన్నారు. ఈ విషయమై అక్కడి పోలీస్ అధికారులను సంప్రదిస్తే మా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతలకు భంగం కలగకుండా మా విధులు నిర్వహిం చామని తెలిపారు. ఇరువర్గాల మధ్య కేసులు బుక్ చేశామని, సామరస్యంగా ఇరువర్గాలు కూర్చొని చర్చించుకుంటే ఈ సమ స్యకు పరిష్కారం దొరుకు తుందని అన్నారు మీడియా వారిని మేము ఏమీ అనలేదని, మా పై అధికారుల సూచనలు పాటించామని తెలిపారు.



# ఊహించని పాస్వర్డ్ వాడండి

- ఇన్స్పెక్టర్ హెచ్. ప్రభాకర్..

**ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :**



సైబర్ అవగాహన అంటే ఆన్లైన్లో సురక్షితంగా ఉండడం, సైబర్ నేరాల (ఫిషింగ్, మాల్వేర్, గుర్తింపు దొంగతనం) నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి అవసరమైన జ్ఞానం, జాగ్రత్తలు తీసుకోవడం, తెలియని లింకులు, అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండడం, ఊహించని పాస్వర్డ్ ఉపయోగించడం ద్వారా మోసాలను నివారించవచ్చు అని పశ్చిమ మండల పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురానగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ హెచ్. ప్రభాకర్ మంగళవారం స్టేట్ హోమ్ లోని దుర్గాబాయి దేష్ ముఖ్ కాలేజీలో విద్యార్థుల విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 150 మంది పైగా విద్యార్థిని విద్యార్థులు హెచ్. ప్రభాకర్ చెప్పిన విషయాలను ఆసక్తిగా విని, వాటిని పాటిస్తామని, వారి తల్లిదండ్రులకు చెప్పి వారి చేత పాటించేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెట్రో కార్ 2 సిబ్బంది తోపాటు సైబర్ వారియర్ పాల్గొన్నారు.

## అమ్మకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పిన తనయులు

**ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :**




తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ (డివిజన్)లో నివాసం ఉంటున్న పొలమారి ప్రసాద్, సుబ్బలక్ష్మి దంపతులు కలివిడిగా ఉంటూ వారి కుటుంబంతో సంతోషంగా గడుపుతూ ఉన్నారు. పి. సుబ్బలక్ష్మి వెంగళరావునగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా కొనసాగుతున్నారు. వారికి ఇద్దరు తనయులు. పెద్దకొడుకు పి. అరుణ్, చిన్న కొడుకు పి. అభిరామ్ ఇద్దరు కలిసి వారి తల్లి (సుబ్బలక్ష్మి) పుట్టినరోజు బుధవారం(11/2/2026) సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏ. ఎం. న్యూస్ మీడియా ద్వారా వారి తల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపాలని కోరారు. పెద్ద కుమారుడు అరుణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం మాఅమ్మ పుట్టినరోజు స్పెషల్‌గా చేయాలని నిర్ణయించామని,ఆసందర్భంగామీడియాద్వారాశుభాకాంక్షలుతెలుపుతున్నామని అన్నారు. చిన్న కుమారుడు అభిరామ్ మాట్లాడుతూ అమ్మకి పుట్టినరోజు వేడుకలు అంటే ఇష్టం ఉండవని, నేను మాఅన్న కలిసి ఈ సంవత్సరం ప్రత్యేకంగా పుట్టినరోజు చేయాలని నిర్ణయించు కొని మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. బుధవారం రోజు ప్రత్యేక కేక్ కట్ తెప్పించి నాన్న(పి. ప్రసాద్) సమక్షంలో అమ్మ చేత కేక్ కట్ చేపిస్తామని ఇద్దరు కొడుకులు తెలిపారు.

# రాష్ట్ర ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

### కేంద్ర నిధులపై ఒత్తిడి పెంచాలి

### బలవంతపు భూ సేకరణలు సరికాదు

### సిపిఎం నేతల డిమాండ్

విజయవాడ,ఫిబ్రవరి11:
రాష్ట్రంలో కీలకమైన పోలవరం, రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రం నుండి ఎంత వరకు సాధించారో చెప్పాలని సిపిఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు. కొత్త నిధుల మాట పక్కనబెట్టి రాష్ట్రానికి హక్కుగా రావలసిన నిధులే రావడంలేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని అంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుండి పన్నుల వాటా రూపంలో రూ. 40,807.28 కోట్లు రావలసి వుండగా, డిసెంబరు వరకు వచ్చింది రూ. 28,846.67 కోట్లు అని, ఇందులో రావలసిన నిధుల్లో 30 శాతం రాలేదని ఆ ఆర్టీ నేతల వి. రాంభూపాల్ అభిప్రాయపడ్డారు. అలాగే గ్రాంట్ల రూపంలో రావలసిన రూ. 32,284.40 కోట్లలో కేవలం రూ. 8,771.67 కోట్లు అంటే 27.17 శాతం మాత్రమే వచ్చాయన్నారు. కేంద్రం నుండి రావలసిన నిధులు పూర్తిగా రాకపోవడం, రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ, సేవారంగాల్లో ఆశించిన అభివృద్ధి సాధించలేకపోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకు అప్పుల్లో కూరుకుపోతోంది. 2025-26 సంవత్సరానికి రూ. 33,185.97 కోట్ల లోటు వుంటుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, 2025 డిసెంబర్ నాటికే రూ. 60,480.55 కోట్ల లోటుకు చేరింది. ఈ సంవత్సరం మూడున్నర లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో రాష్ట్రానికి సుమారు నాలుగున్నర వేల కోట్లు తగ్గిపోతాయి. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ రాష్ట్రాలకు ఇస్తున్న గ్రాంట్లను రద్దు చేసింది. దీనివల్ల రాష్ట్రానికి మరో రూ. 15 వేల కోట్లు తగ్గిపోతాయని అంచనా ఉందన్నారు. అదనపు నిధులు రాబట్టలేకపోగా, వస్తున్న వాటికే కోతలు పెడుతున్న కేంద్ర బిజెపిని నిలదీయకుండా ఏం చేస్తున్నారని అన్నారు. పారిశ్రామికవేత్తల కోసం కూటమి ప్రభుత్వం లక్షల ఎకరాల భూమిని కేటాయిస్తుంది. లక్షల కోట్ల పెట్టుబడులతో వేల పరిశ్రమలు కోట్ల ఉద్యోగాలు అంటూ పాలకులు ప్రచార హోరెత్తిస్తున్నారు. ఇదే తరహా ప్రచారాన్ని గత ప్రభుత్వం కూడా చేసింది. కంపెనీలకు అతి చౌకగా భూములు అప్పగించడానికి ప్రభుత్వం తహతహ లాడుతున్నది. తొంభై తొమ్మిది పైసలకే ఎకరం ఇవ్వడంపై మంత్రి లోకేష్‌ను విలేకరి ప్రశ్నిస్తే ఉచితంగా కూడా ఇస్తాం, తప్పేంటని గద్దించడం ఈ ప్రభుత్వ స్వభావాన్ని స్పష్టం చేసిందన్నారు. బలవంతపు భూ సేకరణను అనేక ప్రాంతాల్లో ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచిపెట్టాలని చూస్తున్నది. ఉద్యమకారుల మీద పి.డి యాక్ట్‌ను కూడా ప్రయోగిస్తున్నది. ఇంత చేసినా పరిశ్రమలు వస్తాయో లేదో అనే సందిగ్ధం పాలకులను వెంటాడుతోందన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాల్లో పది శాతం కూడా అమలులోకి రాలేదు. ప్రజల కొనుగోలుశక్తి పెరగకుండా పెట్టుబడులు రావు, అలాంటి దిశగా ప్రభుత్వ విధానాలు అమలు చేయకుండా దానికి విరుద్ధంగా శాంతిభద్రతలకు విఘాతం చర్యలు అభివృద్ధికి ఎలా తోడ్పడుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గడువులు మారుతున్నాయే తప్ప పూర్తి చేసే పరిస్థితి కనిపించడంలేదు. మొదట్లో పునరావాసం సమస్యను పెద్దగా పట్టించుకోని ప్రభుత్వాలు ప్రజాఉద్యమ ఒత్తిడి మేరకు కొన్ని చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఈ సంవత్సరం కేంద్ర బ్జడెట్‌లో కేటాయించిన నిధులను బట్టి మరో పది సంవత్సరాలు గడిచినా పోలవరం పూర్తి అయ్యే అవకాశం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదట్లో బనకచర్ల ప్రాజెక్టు గురించి చాలా హడావుడి చేశారు. ఇప్పుడు దాని ప్రస్తావనే లేకుండా పోయింది. సుమారు వెయ్యి కోట్లు ఖర్చు చేసిన రాయలసీమ ఎత్తిపోతల పథకం కొనసాగుతుందో లేదో చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. వెలిగొండతో పాటు అనేక ప్రాజెక్టులు ఏళ్లు గడిచినా పూర్తి కావడంలేదు. వీటి కోసం ఉమ్మడిగా కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి నిధులు సాధించడానికి కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఆయన అన్నారు.

# భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు

### రూ. 5,000 కోట్ల దందాను

### పసిగట్టిన జిఎస్టీ ఇంటిలిజెన్స్

**హైదరాబాద్,ఫిబ్రవరి11:**
హైదరాబాద్‌లో భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు అయ్యింది. ఫినటెక్ ముసుగులో రూ. 5,000 కోట్ల దందాను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ పట్టుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల మళ్లింపు చేస్తున్నట్లు డీజీజీఐ గుర్తించింది. 5 వేల కోట్ల రూపాయలు టాక్స్ ఎగ్గొట్టి దుబాయ్‌కి మళ్లించినట్లు తేలింది. టెక్నాలజీని వాడిన హైదరాబాద్ వాసులు బ్యాంకులకే టోకరా వేశారు. ఓటీపీ లేకుండానే 5 వేల కోట్లు నిధుల బదలాయింపు జరిపారు. దుబాయ్ కేంద్రంగా 'మాస్టర్ మైండ్' కొనసాగింది.. హైదరాబాద్‌లో తీగ లాగితే కదిలిన డొంక కదిలింది. నిబంధనలకు విరుద్ధంగా రియల్ మనీ గేమింగ్.. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ఎస్క్రో ఖాతాల వినియోగించినట్లు డీజీజీఐ తెలిపింది. ఓషియానిక్ వెబ్ సొల్యూషన్స్, వెబ్‌విన్ సొల్యూషన్స్ అనే నకిలీ కంపెనీల ద్వారా నిధుల మళ్లించారు. వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా సాగింది. బ్యాంకింగ్ వ్యవహారాలను దుర్వినియోగం చేసి, ఆడిట్‌కు దొరక్కుండా జాగ్రత్తపడ్డారు కేటుగాళ్లు. 'విగోఫిన్' డైరెక్టర్లు ప్రభు కుమార్, రాజశేఖర్ రెడ్డిలపై అధికారుల నిఘా పెట్టారు. ప్రధాన నిందితుడు దుబాయ్ నుంచి ఈ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నట్లు గుర్తించారు.